'స్వాతి' వారపత్రిక - 25.3.2005

# బేబి వినీత

ఉదయం ఒక పావుగంట ముందుగా గోదావరి ఎక్స్‌ప్రెస్ వైజాగ్ చేరుకుంది. అది గమనించకుండా తనని సునీత రిసీవ్ చేసుకోవడానికి రాలేదని చిందులు తొక్కుతున్నాడు. విజయ్. అంతలో - "బావా!" అన్న తీయని పిలుపు విని వెనుతిరిగి చూశాడు.

నవ్వుతూ నీలి కళ్ళు, ఇంపోర్టెడ్ బ్లాక్ టాప్, బ్లూ జీన్స్ ప్యాంట్‌లో సన్నగా, తెల్లగా, పొడవుగా, వక్షం నిండుగా ఓ అందాల రాశి తన ముందు ప్రత్యక్షమైంది.

ఆమె పిలిచిన 'బావా' అనే పిలుపుకి మెలికలు తిరిగిపోయి మేఘాల్లోకి, రోదసీలోకి దూసుకుపోయాడు.

ఇంతకీ ఆ నీలి కళ్ళ సుందరాంగి ఎవరు?

"నమస్తే. నా పేరు వినీత. మిమ్మల్ని రిసీవ్ చేసుకోవడానికి సునీత బదులు వచ్చేను. సునీత నా కజిన్" అని మర్యాదగా కుడిచేయి ముందుకు చాచింది.

అప్సరసను తాకే అదృష్టమా! ఆలస్యం చేయకుండా చేయి ముందుకు చాచాడు విజయ్. ఒక అద్భుతమైన పరిమళమేదో ఒక్కసారిగా తన శరీరంలోకి ప్రవహించినట్టయింది. ఓ తీయని పారవశ్యం.

విజయ్ తన గురించి పరిచయం చేసుకోబోతుంటే - "మీ బయోడేటా నాకు తెలుసు"

అన్నది వినీత.

"మిమ్మల్ని ఎప్పుడూ చూసినట్టు గుర్తులేదు"

"మీరు నన్ను చూడలేదు. నేను మిమ్మల్ని చూశాను. మీ వెడ్డింగ్ ఫోటోస్ చూశాను. మీది వెరీ హేండ్‌సమ్ పెర్సనాలిటీ. మిమ్మల్ని ఎక్కడున్నా గుర్తుపట్టచ్చు. ఫోటోలో కన్నా ప్రత్యక్షంగా ఇంకా బాగున్నారు. ఎంత బాగున్నారంటే - నేను మిమ్మల్ని సునీత కన్నా ముందుగా చూసుంటే ఉన్నపళంగా లేవదీసుకు పోయేదాన్ని-" అంది.

"థాంక్యూ! ఫర్ యువర్ కాంప్లిమెంట్. అయితే మేడమ్! మన ఆంధ్రదేశంలో మగవాళ్ళను లేవదీసుకుపోయే ఆడ పహిల్వాన్‌లు ఉన్నారన్నమాట."

"వైనాట్? నా రూటే వేరు. నో సెంటిమెంట్స్. మీరు రడీయా చెప్పండి. నేను రడీ" అంది.

ఆమె మాటలకు అతను నవ్వేడు.

స్టేషన్‌కి రమ్మని ఆదేశించిన సునీత రానందుకు బాధ కలగలేదు విజయ్‌కి. వినీత నుంచి వస్తున్న తీయని పరిమళాన్ని పీలుస్తూ ఆమెతో బాటు నడుస్తుంటే.. రైలు దిగి రెక్కల గుర్రమెక్కినట్టుగా వుందతనికి.

విజయ్‌కి సునీతతో పెళ్ళయి ఒక ఏడాది పూర్తికాలేదు. పెళ్ళి అయ్యాక ఒక్కరోజు కూడా తనని వదిలి వుండని సునీత, ఒక్కసారిగా వారం రోజులు తన నుంచి సెలవు తీసుకుని పుట్టింటికి వచ్చేసింది.

అన్న పెళ్ళి కోసం సునీత వెళ్ళిపోయాక, సునీత లేని లోటు స్పష్టంగా కనిపించింది విజయ్‌కి.

విరహాగ్నితో వేగి, కాగి రెండు రోజులు ముందుగానే బయల్దేరాడు విజయ్. తను పెళ్ళి రోజున ప్రత్యక్షమయి, అక్షింతలు జల్లేసి వెంటనే సునీతను చుట్టబెట్టుకొని పరుగున వెనక్కి వచ్చేద్దామనుకున్నాడు.

బైల్దేరుతుంటే కంపెనీ లీవ్ దగ్గర పేచి పెట్టింది. 'నీవు ..... అర్జెంట్‌గా భువనేశ్వర్ వెళ్ళాలి. తప్పదు' అంది యాజమాన్యం. 'చచ్చాన్రోయ్ దేవుడా' అనుకున్నాడు. తనో రాజీ మార్గం చెప్పేడు. అంగీకరించింది కంపెనీ. అదేమిటంటే తను రెండు రోజులు వైజాగ్‌లో సెలవు తీసుకుని అక్కడ నుంచి డైరక్టుగా అఫీషియల్ టూర్‌పై భువనేశ్వర్‌కి పరిగెట్టడం. అక్కడ వారం రోజుల ప్రోగ్రాం.

ముందు తనకు సునీత గాలి తగిలితే గాని మనిషి కాలేదు. ఆమెతో ఒక రాత్రి గడిపితే చాలు, వేయి ఏనుగుల బలంతో భువనేశ్వర్ కాదు భూటాన్ కైనా వెళ్ళడానికి సిద్ధం. సునీతను స్టేషన్‌కే వచ్చి రిసీవ్ చేసుకొమ్మని ఆదేశించేడు. కానీ సునీత రాలేదు. వినీత వచ్చింది.

"బావా! ఇంత లగేజ్‌తో వచ్చారేం - ఒకరోజు పెళ్ళికి మా ఆడవాళ్ళు రెండు డజన్ల

చీరల్తో దిగినట్లు!"

పెళ్ళి తర్వాత భువనేశ్వర్ టూర్ విషయం చెప్పేడు. "వావ్!" అని ఎగిరి గంతేసింది వినీత.

"బావా! ఇఫ్ యూ డోంట్ మైండ్ నేనూ నీతో వస్తాను. అవును బావా! నాకు పూరీ జగన్నాథుడి కన్నా, కోణార్క్ టెంపుల్ శిల్ప సౌందర్యం చూడాలని ఉంది. నన్ను తీసుకెళ్ళవా" అని చిన్నపిల్లలా మారం చేసింది.

విజయ్‌కి మతిపోయింది. 'ఆమె ఎవరు? నేను ఎవరు? నాతో రావడమేమిటి? ఇదేదో బాగానే ఉన్నట్టుంది. కోణార్క్ శృంగార భంగిమలన్నీ ఈ పిల్లలో చూడవచ్చు. మజా చేయవచ్చు' - కాని ఏదో భయం.

'వెల్‌కమ్' అనడానికి సాహసం చాలక, "నేను వెళ్ళేది ఆఫీసు పనిమీద. విహారయాత్రకి కాదు" అన్నాడు.

"నన్ను తీసుకెళ్ళండి. టూర్‌ని మెటీరియలిస్టిక్‌గా కాక రంజుగా ఎలా మలుచుకోవాలో చూపిస్తా".

వల విసరక ముందే నీట్లో చేప తన బుట్టలో పడిపోతున్నట్టుంది.

"మీ పేరేమిటన్నారు.. మర్చిపోయేను."

"మతిమరుపు బావా! నా పేరు వినీత. నీవు నన్ను బేబీ అని పిలవొచ్చు. అందరూ నన్ను అలాగే పిలుస్తారు. ఇంతకీ, నీతో టూర్‌కి తీసుకెళ్తున్నావా లేదా?"

"ఏదో సామెత చెప్పినట్టు వుంది. ఇంకా నా టిక్కెట్టే కన్‌ఫామ్ కాలేదు బేబీ" అన్నాడు విజయ్.

"నో ప్రాబ్లెమ్. నాకా టికెట్ ఇవ్వండి. నాకు తెలిసిన వాళ్లున్నారు. ఎమర్జన్సీ కోటాలో కన్‌ఫామ్ చేయిస్తా - ఒకటి కాదు రెండు" అన్నది వినీత.

"నీవు కన్‌ఫామ్ టికెట్స్ సంపాదిస్తే... నిన్ను తీసుకెళ్ళినట్టే లెక్క" అన్నాడు విజయ్.

"అలాగన్నావ్ బావుంది" అందామె నవ్వుతూ.

తనను రిసీవ్ చేసుకోవడానికి బేబీ అలియాస్ వినీత మారుతీ జెన్ ఏసీ కారులో వచ్చిందనేది తెలిసి విస్మయం చెందేడు విజయ్. లగేజ్ కారులో పెట్టి ఆమె పక్కన కూర్చున్నాడు విజయ్. వినీత డ్రైవ్ చేస్తోంది.

కారు కుదుపులకి ఇంపోర్టెడ్ టాప్‌లోంచి ఉబుకుతున్న వక్షంపై అతని చూపులు పడడాన్ని బేబీ వినీత గమనించి "ఇడియట్" అని నెమ్మదిగా అంది పెద్దగా నవ్వుతూ. విజయ్ ముఖం చిన్నబోయింది.

పెళ్ళిసందడితో కళకళలాడుతున్న ఇంటి ముందు ఆగింది కారు. పరుగున వచ్చింది సునీత.

"ఇదిగో అక్కా! నీ మొగుడు బాగా నచ్చేశాడు. నేను అమెరికాకి లేవదీసుకుపోతా. తర్వాత

నాపై పడి ఏడ్వకు. ఏడ్చినా ఐ డోంట్ కేర్" అని నవ్వుతూ విజయ్‌ని లగేజ్‌తో సహా అక్కడ దింపేసి వెళ్ళింది వినీత.

"మా బేబీకి తిక్క వుంది. దానికి తోచింది చేసేస్తుంది. జాగర్త" అని సునీత భర్తని హెచ్చరించింది.

విజయ్‌కి వేడినీళ్ళ స్నానం, తర్వాత టిఫిన్ ఏర్పాటు చేసింది సునీత. మళ్లీ ఆమె కనిపించలేదు.

విజయ్‌ని వినీత నీలి కళ్ళు వెంటాడుతున్నాయి. ఆమె గురించి తెలుసుకోవాలని.. ఆమె విషయం బావమరిది కిరణ్ దగ్గర కదిపేడు. వాళ్లిద్దరూ బంధువులే కాక అమెరికా మిత్రులు కదా. అతడు చెప్పింది ఏమిటంటే -

"మా పెదనాన్న కూతరు వినీత. ఆమెకు మొదట నుంచీ అభ్యుదయ భావాలు వంటబట్టాయి. తను ఇంజనీరింగ్ చదివింది. చాలా తెలివయింది. ఎమ్.ఐ.టి.లో ఎమ్.ఎస్. చేసి బోస్టన్‌లో ఉద్యోగం చేస్తోంది.

మా పెదనాన్న, పెద్దమ్మ ఇద్దరూ కూడా వామపక్ష భావాలు కలవారు. పూర్తిగా ప్రజాసేవకు అంకితమయినవారు. వాళ్ళు కూతుర్ని పెళ్ళిచేసుకొమ్మని కోరేరు. నీకు ఎవరైతే ఇష్టమో అతడినే పెళ్ళి చేసుకొమ్మని స్వేచ్ఛనిచ్చేరు. కాని వినీత తనకు పెళ్ళి చేసుకోవడమే ఇష్టం లేదని స్పష్టంగా చెప్పేసింది. వాళ్ళు 'సరే నీ ఇష్టం' అని ఆమె స్వేచ్ఛకి అడ్డు తగలకుండా తప్పుకున్నారు.

"తనకు తోచిందే చేస్తుంది గాని అవతల వాళ్ళ మాట వినదు. దేనికీ రాజీ పడదు. ఆకలి, దాహం లానే సెక్సుని కూడా ట్రీట్ చేస్తుంది. అందుకుగాను ఒక మొగుడు గాడు, మూడుముళ్ళు అక్కర్లేదంటుంది.

"చిత్రమేమిటంటే తనెప్పుడూ సీరియస్‌గా ఉండదు. అల్లరి, పెంకితనం, కొంటెతనం, ఏ రహస్యాలు లేనట్టు బోళాగా మాటాడేయటం, నవ్వొస్తే నవ్వేయటం. కోపం వస్తే ధుమధుమలాడిపోవడం ఆమె నైజం. ఆమె వ్యక్తిత్వం వజ్రంలా స్థిరమైనది. ఆమె నాతో బాటు ఇండియా వచ్చింది" అని చెప్పేడు కిరణ్.

విజయ్ ఆశ్చర్యపోయేడు. ఏదో అల్లరిపిల్ల అనుకున్నాడు గాని, ఇంత కథ వుందని ఊహించలేదు. మళ్లీ ఆమెను చూడాలనే తపన పెరిగింది విజయ్‌కి.

అటు వినీత కనబడలేదు. ఇటు సునీత కనపడలేదు.

సునీత రాత్రి దొరక్కుండా పోదు. 'అలసిపోయాను. నిద్రొస్తోంది అని బతిమాలినా వదిలేది లేదు. తెల్లార్లు నిద్రపోనిచ్చేది లేదు' అనుకున్నాడు విజయ్.

అయితే ఆ రాత్రి విజయ్‌కి ఆశాభంగం అయింది.

ఏసీ గదిలో డబుల్ కాట్ మీద, బావమరిది కిరణ్ పక్కన తన పక్క ఏర్పాటు చేశారు! హతవిధీ! బావమరిది పక్కన పడుకోవడానికా తను వచ్చింది!

తెలతెలవారుతుండగా బేబీ వినీత కలలో కనిపించి 'బావా ! లేచిపోదాం రా' అని నీలి కళ్ళతో పిలుస్తోంది - చేతులు చాచి. తుళ్ళిపడి లేచేడు విజయ్.

ఎదురుగా బేబీ వినీత. అది కల కాదు. వేడి సెగల్తో ఆమె చేతిలో కాఫీ కప్పు వుంది. కళ్ళు తెరవగానే ఆమె అద్భుత సౌందర్యానికి అబ్బురం చెందేడు. నిద్రమత్తు వదిలిపోయింది. నిన్న సిల్కు టాప్, జీన్స్ ప్యాంట్‌లో కనిపించిన బేబీ వినీత, ఇప్పుడు ఉంగరాల జుట్టు విరబోసుకుని, ఆకు పచ్చ పట్టుచీరలో అప్సరసలా ధగధగా మెరిసిపోతోంది.

గదిలో ఎవరూ లేరు. బెడ్ పార్టనర్ కిరణ్ కూడా లేడు. పెళ్ళికొడుకుని చేస్తున్నారని వినీత చెప్పగా తెలిసింది. సునీత కూడా అక్కడే ఉందట.

"కాఫీ తాగు బావ" అంటూ కాఫీ ఇస్తున్నప్పుడు ఆమె పయిట జారింది. వక్షాలు పర్వతాల్లా అతనిపై పడి ఊపిరి ఆడనీయకుండా చేశాయి.

"ఒక్క నిముషం" అని బాత్రూంకి వెళ్ళివచ్చేడు.

"నిద్ర పట్టలేదా బావా!" అనడిగింది.

"ఏం చెప్పమంటావ్ బేబీ! అయిదారు రోజుల తర్వాత పెళ్ళాం కోసం ఆవురావురమని వస్తే, నా పక్కన బావమరిది పడుకున్నాడు. అదీ సంగతి".

అతని మాటలకి పకపకమని నవ్వుతూ "ఈ రాత్రికి నీ కోరిక తప్పక తీరుతుంది బావా. మీ పడక ఈ రోజు మా ఇంట్లోనే" అని వినీత అనడంతో విజయ్ కాఫీ తాగుతూ పొలమారేడు.

ఆమె సెక్స్‌ను కూడా ఆకలి మాదిరిగానే భావిస్తుంది - అన్న బావమరిది మాటలు గుర్తుకొచ్చి 'ఏమి నా అదృష్టం' అనుకున్నాడు. సునీత అనుకున్నది వినీత అవుతుంది!

కన్‌ఫామ్ కాని భువనేశ్వర్ టికెట్ విజయ్ దగ్గర నుంచి తీసుకుంది వినీత. రెండు టికెట్లు తీసుకుంటానంది. ఎమర్జన్సీ కోటాలో కన్‌ఫామ్ చేయిస్తానంది.

ఆమె ప్రయత్నం ఫలించి రెండు టిక్కెట్లు కన్‌ఫామ్ కావాలని దేవుణ్ణి ప్రార్థించేడు విజయ్.

పెళ్ళి సందడిని పక్కన పెట్టి ఆ సాయంత్రం విజయ్, బేబీ వినీత ఇద్దరూ కారులో రామకృష్ణా బీచ్‌కి వెళ్ళేరు. ఇద్దరూ సముద్రపు ఒడ్డున కూర్చున్నారు.

కాసేపటికి ఏదో ధైర్యం వచ్చి వినీత చేయిని తన చేతుల్లోకి తీసుకున్నాడు విజయ్. నల్లరాళ్ళను రెచ్చగొడుతున్న సముద్ర కెరటాలు అతన్ని ఉద్రేకిస్తున్నాయి.

"బావా" అంది వినీత. "ఊఁ" అన్నాడు విజయ్.

"ఇక్కడ నాకు రెండు నచ్చేయి" అంది వినీత.

"ఏమిటి?" అడిగాడు విజయ్.

"మొదట మీరు! రెండు మామిడిపళ్ళు!"

ఉబ్బితబ్బిబ్బయి "బేబీ! మన పరిచయం కేవలం కొన్ని గంటలు. ఇంత తక్కువ వ్యవధిలో నేను నీకెలా దొరికిపోయేను? నాలో ఏం చూసేవు?" అన్నాడు విజయ్.

"అదే నాకు అర్థం కాలేదు బావా. గాలిలో పరిమళం హాయినిస్తుంది. కాని దాన్ని

చూపలేం. ఈ వెధవ మనసు చిత్రమైనది. మహా చంచలమైనది. అవును నిజమే! నీలో ఏమి చూసి నిన్ను కావాలనుకుంటున్నాను కానిప్పటికీ తెలియకుంటోంది. నాకు నవ్వొస్తోంది కూడా.

“అంతెందుకు బావా! మన కిరణ్ ఒకరోజు మేఘన ఫొటో, బయోడాటా కంప్యూటర్‌లో చూసి, తర్వాత పెళ్ళిచూపులంటూ ఆమెను కేవలం ఒక్కసారే చూసి.. ఈ రోజు ఆమెను పెళ్ళాడేస్తున్నాడు. ‘మేఘనలో ఏం చూసి పెళ్ళాడేస్తున్నావ్? ఆమె గురించి నీకేం తెలుసు? ఒక పరిచయం లేదు. ఒక డేటింగ్ లేదు. ఇంట్లో ఏదో ఒత్తిడి చేస్తే, ఏదో చేసేసుకోవాలని గబగబా చేసేసుకోవడం పద్ధతి కాదు’ అని నేను అతనితో గొడవపడ్డాను. చిత్రమేమిటంటే నీ విషయంలో నేనూ తను చేసిన పనే చేస్తున్నాను” అంది.

“రెండింటికీ తేడా ఉంది బేబీ! కిరణ్ సంప్రదాయ బద్ధంగా ఒక పెళ్లికాని అమ్మాయిని వివాహం చేసుకుంటున్నాడు. నీ కేసు ఏమిటంటే - నీవు ఒక పెళ్ళి అయిన వాడిని ఎంతో కొంత కాలం జస్ట్ ఫర్ లివింగ్ టుగెదర్‌కి ప్రపోజ్ చేస్తున్నావు” అన్నాడు.

తర్వాత టాపిక్ మార్చి ఏవేవో విషయాలు సరదాగా మాటాడుకుని ఇరువురూ కారులో తిరిగి ఇంటి ముఖం పట్టేరు.

డిన్నర్ అయ్యేక - “బావా! నీ ఆకలి ఇది కాదు కదా. పద మా ఇంటికి” అని విజయ్‌ని తీసుకువెళ్ళింది.

అది బెడ్‌రూమ్. అప్పటికే ఏసీ ఆన్ చేయబడి ఉంది.

గదిలో మత్తెక్కించే ఏదో విదేశీ పరిమళం. మంద్రమంద్రంగా సన్నని తీయని సంగీతం. రూమ్ నీటుగా ప్లజెంట్‌గా వుంది. ఇక సుఖమే తరువాయి!

వినీతపై అతనిలో మన్మథతాపం అంకురిస్తున్నది. అల్లరి పెడుతున్నది.

“బావా!... ఒక పావుగంట ఓపిక పట్టండి” అంటూ బయటకు వెళ్లింది.

పావుగంట దాటేక అతని మన్మథతాపం చల్లార్చడానికి వచ్చిన స్త్రీ సునీత! ఒక్కసారిగా దిమ్మతిరిగిపోయింది విజయ్‌కి. ఏమైతేనేం, ఎవరైతేనేం తలుపులు మూసుకున్నాయి.

“ఏమిటండీ ఇది. అసలు మీకేమైనా బుద్ధి వుందా? అటు పెళ్లి గోల. ఇటు మీ గోల. రెండు రోజులు ఆ మాత్రం ఓపిక పట్టలేరా? మా అన్నయ్య మంచం మీద పడుకోవడానికేం? నేను ఇక్కడికి రానంటే బేబీ ఏమన్నదో తెల్సా?” అన్నది సునీత.

“ఏమిటంది?” అన్నాడు విజయ్.

“నేను రానని మొండికేస్తే అదే మీ పక్కలోకి వచ్చేసి రాత్రంతా జాగరణ చేస్తానంది. సిగ్గుమాలినిది. అది నిజంగానే అంతపని చేస్తుందని భయపడి పరుగున వచ్చేశాను” అంది సునీత నవ్వుతూ.

‘అయ్యో! ఎంత పని చేశావ్ డార్లింగ్. దొరికిన అవకాశం కాస్తా జారిపోయింది గదా’ అని మనసులో గిలగిలలాడినప్పటికీ - కౌగిలిలో ఉత్కృష్ట రసానందం అది ఎవరి వల్ల

ఆవిష్కృతమయినా అది అద్భుతమైనదీ, మహత్తరమైనదీ అని ఆ గదిలో నిరూపిత మయింది.

హాయి హాయిగా తెల్లవారింది విజయ్‌కి.

తేలిగ్గా ఒళ్ళు విరుచుకుంటూ లేచేడు. కళ్ళు తెరిచి చూశాడు. పక్కలో సునీత లేదు. ఎదురుగా వినీత...! ఈసారి సల్వార్ కమీజులో మెరిసిపోతోంది.

"మీ శ్రీమతి అరగంట క్రితమే వెళ్ళింది బావా" అంది గుడ్‌మార్నింగ్ చెబుతూ.

"నేను ఆమెను అడగలేదు కదా బేబీ"

"అవును మరి. అక్క అవసరం తీరిపోయింది కదా... ఓహ్! అబ్బాయిగారి మొహం దేదీప్యమానంగా వెలిగిపోతోంది... బావా! నీ కింత సాయం చేశాను కదా! థాంక్స్ చెప్పడానికి నోరు రాదా మిత్రద్రోహి!"

"అయినది ఒక్కటీ.. అనుకున్నది ఒక్కటీ" అని విజయ్ నిష్ఠూరంగా అంటే -

"బోల్తా కొట్టించలేవు బావా ఈ బుల్‌బుల్ పిట్టని" అంటూ డ్యాన్స్ చేస్తూ వికవికా నవ్వింది బేబీ వినీత.

విజయ్ చేతిలో టికెట్ పెట్టి "బావా! అది భువనేశ్వర్‌కి కన్‌ఫామ్ టికెట్. నీ ఒక్కడికే కాదు. ఇద్దరికి" అంది బేబీ వినీత.

గతుక్కుమన్నాడు. మరోవైపు ఆనందమైంది. గత రాత్రి తప్పించుకున్నా, వాహ్! రేపటి నుంచి ఏకంగా ఏడు రాత్రులు తనకు రసానందం ఇవ్వబోతుంది.

"నీవు నాతో వస్తున్న విషయం సునీతకి తెలియదు కదా?" అన్నాడు విజయ్ గాబరాగా.

"చెబితే తెలుస్తుంది, చెప్పనా!" అంది వినీత.

"అమ్మో! మన ఇద్దరినీ చంపేస్తుంది" అంటూ, ఈ వ్యవహారం ఏ విధంగా రహస్యంగా సాగించాలనేది సూచించేడు. వినీత వికవికా నవ్వింది.

మొత్తానికి కిరణ్ పెళ్ళి ఘనంగా, అతి వైభవంగా జరిగిపోయింది. ఆ రోజు కిరణ్ తన భార్య మేఘనతో అమెరికా ప్రయాణం హడావుడి.

ఆ రాత్రే విజయ్ భువనేశ్వర్ ప్రయాణం.

అన్నయ్య తనకు ముప్ఫయి వేలు పెట్టి కొన్న ఎయిర్ కండిషన్ ప్యాకేజీని చూపించింది సునీత. ఆనందించేడు విజయ్. తర్వాత మరో విషయం చెప్పింది సునీత - ఇప్పుడు అన్నయ్య వాళ్ళతో బాటు వినీత కూడా అమెరికా వెళ్ళిపోతున్నది. షాక్ తినేశాడు విజయ్.

వెంటనే వినీత ఇంటి కెళ్ళాడు. వినీత ఎయిర్‌పోర్టుకి బైల్దేరడానికి సిద్ధంగా ఉంది. బ్రవున్ టీషర్టు టక్ చేసిన బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు. గదిలో ఎవరూ లేరు. విజయ్‌ని ఆహ్వానించిందామె. తిక్కరేగిపోతోందతనికి.

"మోసం! భువనేశ్వర్‌కి నాతో వస్తానని చెప్పి, ఊరించి ఇలా చల్లగా అమెరికా జారుకుంటున్నావేమిటి?"

"నేను వస్తాననలేదు. నీవనుకున్నావ్. నేను టికెట్ తీసింది నీకు, మీ ఆవిడకీ. గో అండ్

ఎంజాయ్" అంది చిన్నగా నీలి కళ్ళతో నవ్వుతూ.

"నీవిలా ఛీట్ చేస్తావనుకోలేదు" అని ఆమె పైకి వచ్చేడు విజయ్ ఆవేశంగా.

"షటప్" అంది బేబీ వినీత. తగ్గిపోయేడు.

"బావా! పిరికివాళ్ళతో దొంగచాటుగా ప్రయాణాలు చేయడం నాకు ఇష్టముండదు. సునీతతో వెడ్‌లాక్ బ్రేక్ చేసుకొని నాతో వచ్చే ధైర్యం నీకు లేదు. అసలు నీకా ఉద్దేశం లేదు. కాని నీకు నా శరీరం మాత్రం కావాలి. అదీ కూడా డైరక్టుగా అడిగే శక్తి నీకు లేదు. ఒకవైపు సునీతకి భర్తగా ద్రోహం చేస్తూ, నాకు ద్రోహం చేయడానికి సిద్ధపడ్డ నయవంచకుడివి" అంది కోపంగా.

"ద్రోహం చేయడం ఏమిటీ?" అన్నాడు విజయ్.

"ద్రోహం కాకపోతే దుర్మార్గం. ఏదైతేనేం నీది దొంగబుద్ధి. నక్క వేషాలు. నేను కోణార్క్ టెంపుల్ చూడడానికి వస్తానన్నాను గాని... ఏడు రాత్రులు నీతో పడుకోడానికి వస్తాననలేదు. పెళ్ళానికి తెలియకుండా కనుగప్పి వచ్చి మరీ పడుకోవాలిట! ఛీ! ఐ హేట్ యూ"

"నీవు పొరపడుతున్నావ్ బేబీ, నాకా ఉద్దేశం లేదు"

"ఇది మరో అబద్ధం. మగవాడు ఆడదాన్ని అబద్ధాలతోనే వంచిస్తాడు. దగా చేస్తాడు. నీవు ఇక్కడికి రెండు రోజుల క్రితం పిచ్చెక్కిపోయినట్టు మీ ఆవిడ పొందు కోసం వచ్చావ్. అందుకు పరిస్థితులు అనుకూలించకపోతే మా ఇంట్లో నీకా అవకాశం కల్పించాను.

"కాని నీవు పాత పచ్చడి పెళ్ళాం బదులు కొత్త పిట్ట కావాలని నన్ను ఆశించావ్. పరాయి స్త్రీపై ఒక వివాహితుడు వ్యామోహపడితే అతడిని రసికుడంటారు.

అదే పని స్త్రీ చేస్తే బరి తెగించిన బజారుది అంటారు. ఐ డోంట్ కేర్ దిస్ మేల్ డామినేటెడ్ సొసైటీ" - మొహమంతా కందిపోగా ఆవేశంగా అంది బేబీ వినీత.

"బేబీ! అయామ్ సారీ! నీ పట్ల నేను అమర్యాదగా ప్రవర్తించినట్టు అనిపిస్తే, నన్ను పూర్తిగా క్షమించు" అన్నాడు విజయ్ బుద్ధిగా తల వంచుకుని.

బేబీ వినీత చల్లబడిపోయింది.

"పిచ్చిబావా! నేను నిన్ను కాదు, మగవాళ్ళ నైజాన్ని క్షమించలేను. నీ వంటే నాకు ఇష్టం. ఒక విధంగా నీ ఆకర్షణలో పడి నేనే నిన్ను రెచ్చగొట్టానేమో! ఏనీవే అదంతా మర్చిపో. సంతోషంగా ఉండు...బావ! మళ్ళీ చెబుతున్నాను. భువనేశ్వర్ నీ వొక్కడివే కాదు. మా అక్కతో కలిసి వెళ్ళి మజా చేయ్. నీ టూర్‌ని రసాత్మకంగా మలుచుకుంటే అది హనీమూన్‌గా మారిపోతుంది. ఆల్ ద బెస్ట్ అండ్ గుడ్ బై" అంటూ విజయ్‌ని సమీపించి అతని పెదాలకు తన పెదాలు అంటించి, గాఢోద్రేకమయిన ముద్దు పెట్టుకుంది.

"మగవాడు కాదు. అసలు యవ్వనమే చెడ్డది. ప్లీజ్ ఇక్కడ నుంచి వెంటనే వెళ్ళిపో!" అని విజయ్‌ని వదిలి బయటకు పరిగెట్టిందామె. స్థాణువుగా నిలబడిపోయేడు విజయ్. ఆమె వెళ్ళినా ఏదో పరిమళం అతడిని ఆవహించి అలా వుండిపోయింది.